# కథ అడ్డంగా తిరిగింది

లోకములో ఎన్నో ఆటలు ఉన్నవి పిల్లలు ఆడుకొనేవి. బొమ్మలకు పెండ్లి చేస్తారు, పెళ్ళి కూతుళ్ళను ఊరేగిస్తారు; ఏకందిపప్పో, ఏ శనగగింజలో లక్కపిడతలలో పోసి వట్టివట్టి పొయ్యిలమీద వంటలు చేసి, వండినవాళ్ళే మళ్ళీ వడ్డించుకొని తింటారు. వండుతూ వండుతూనే తినడంకూడా కద్దు. అవన్నీ వుత్త ఆటలు; నిజమైన ఆటసంగతి చెప్పితే మజా.

నాగేశం గొప్పయింట పుట్టిన బిడ్డ కావడముచేత ఆడింది ఆట పాడింది పాట. అబ్బాయి ఏది కావలెనంటే అది వచ్చి దూకుతుంది. లేక లేక పుట్టినవాడు కావడము వల్లనూ, దేవుడిచ్చినదికాస్త వున్నది కాబట్టీ అతని ఆటలు సాగుతూ వచ్చినవి.

ఆటేమిటో చెప్పుతాను. అది బొమ్మలపెళ్ళి కాదు, లక్కపిడతలవంట కాదు - ఇంట్లో రామలక్ష్మణులకూ సీతమ్మ వారికీ భోజనాలు! మూడు విస్తళ్ళు వేసి ముగ్గురికీ భోజనము పెట్టిస్తాడు నాగేశం రోజూ ముప్పూటలా. ఇంట్లో చేసుకొన్న వస్తువులన్నీ విస్తళ్ళలో వడ్డించమని, నెమ్మదిగా తినండని వకమాటని, మారు వడ్డించుకోండని ఇంకోమాటని, తినడం అయిందని చివరకు విస్తళ్ళు గోతిలో వేయిస్తాడు నాగేశం. ఈ సంతర్పణలు ఆగకపోతే సీతారామలక్ష్మణులకు అజీర్ణం చేసి, వారు ఏఖాండవ వనమో దహించవలసి వచ్చేది బాధపోయేటందుకు! ఇంట్లో వాళ్ళను ఏడిపించడములో నేమి, వంటలక్కను తిప్పలు పెట్టడములో నేమి ఆరితేరినాడు అబ్బాయి.

శ్రుతిమించి రాగానపడ్డది. రోజురోజూ ఈ సంతర్పణలే. ఏమో చిన్నతనమని పోనిస్తూ వుంటే మరీ అబ్బాయి చెలరేగుతున్నాడు. రోజూ ఈ సంతర్పణలు చెయ్యలేక ఇంట్లో వాళ్ళ ప్రాణాలు విసిగిపోయినవి.

❖ ❖ ❖

ఒకనాడు నాగేశం మేనమామ రామావధాని వచ్చినాడు. పిల్లవాని తుంటరితనమును గురించి తల్లి తన అన్నగారితో చెప్పింది. ఆయనకు భూతవైద్యంకూడా

తెలియడము చేత పిల్లవానికి విభూతి పెట్టుతాడని తల్లి ఆశ. ఇంతలోనే నాగేశం స్కూలునుంచి కేకలు వేస్తూ రావడము వినిపించింది.

బయలుదేరెను మా సిపాయిదండు
బయట ఉండకుండ మీరెల్లరండు
అని గంతులు వేస్తూ వచ్చి –
అంతట కనిపించె మా అవ్వగుండు
అంత పడె నామెపై తలగడదిండు

అని దీర్ఘాలు తీస్తూ వంటలక్క తలకాయ మీద పుస్తకాలు పెట్టినాడు నాగేశం. వాని తల్లి అన్నగారివంక చూచింది, ఆయన ఆమెవంక చూచినాడు,. ఇద్దరూ నవ్వుకొన్నారు.

కాస్తసేపటికి నాగేశం చొక్కాలాగూ విడిచి కాళ్ళు కడుక్కొని పట్టుగోచీ పెట్టుకొని పడమటింట్లోకి వెళ్ళినాడు. సీతకు, రామలక్ష్మణులకూ విస్తళ్ళు వెయ్యమన్నాడు – మామూలుగా మూడు విస్తళ్ళూ పడ్డవి. కూరలు, పప్పూ వడ్డించారు, అన్నం వడ్డించారు.

తరువాత నాగేశం తినండి తినండి అన్నాడు. ఎవరు తింటారు? విస్తళ్ళు కదలకుండా వున్నవి; నాగేశం తినడం ఆరంభమయినదంటూ 'వంకాయనేతిలో వేయించారు మరికొంచెం వేసుకో' మని రాముడిని 'కందిపచ్చడి జీలకర్ర వేసి నూరినారు ఇంకా కాస్త వేయించుకో' మని లక్ష్మణునీ 'పొడివేసి పెట్టినారు చారు చాలా బాగావున్నది. మరికొంచెం వేయించుకో'మని సీతనూ బలవంతపెట్టినాడు. మధ్య మధ్య మూడు విస్తళ్ళలోనూ మారు వడ్డించమన్నాడు. చివరకు మీగడ పెరుగు తెమ్మన్నాడు.

ఇదంతా చూసి అవధానిగారు దొడ్డిలోకి వెళ్ళినాడు. చెల్లెలు ఆయన వెంటనే వెళ్ళింది.

"చూశావా అన్నయ్యా, రోజూ ఇదే నాటకం! పిచ్చేమో!"

"సరే తెలిసింది. ఇట్లా వదిలిపెట్టావా కొద్దిరోజులలోనే కొంప కళాసైపోతుంది. మందు మర్మాలెరిగిన నేనుండంగా నీకు విచారమెందుకు?" అంటూనే వేపమండ విరిచినాడు.

"కొడతావా యేమిటి? నేను చూడలేను!"

"మరేమీ భయము లేదు. ఏడిస్తే ఏడువిధాల మంచిదని శాస్త్రకారుడు అన్నాడు. జలుబునీళ్ళు కారిపోతవి, శ్లేష్మం కొట్టుకుపోతుంది" అంటూ లోపలికి వెళ్ళినాడు.

ఇంతలోనే భోజనాలయినవి. విస్తళ్ళు గొందిలో పారవెయ్యమని పోరుపెట్టుతున్నాడు నాగేశం. అవధానిగారు విస్తళ్ళవంక తేరిపార చూచినాడు.

"నాగేశం, నీవు సీతమ్మకు, రామలక్ష్మణులకు భోజనాలు పెట్టినావు, వారు నీకు బహుమతి పంపినారు!"

"ఎవరు! రాముడా, లక్ష్మణుడా, సీతా?"

"ముగ్గురూ!" అంటూ బట్టవెనుక నుంచి పైకి తీసినాడు బెత్తము. గుండెలవిసిపోయినవి పాపము కుఱ్ఱవానికి! ముఖం వెలవెలబారింది.

"ఇదిగో ఇది నాకిచ్చి రెండు తగిలించమన్నాడు రాముడు" అని రామావధాని రెండు అంటించాడు.

"అమ్మో, అమ్మో!" అని నాగేశం బొబ్బలు పెట్టినాడు.

"లక్ష్మణుడిదో", అంటూ మరి రెండు తగిలించి నాడవధాని. నాగేశం మఱింతకేకలు పెట్టినాడు.

"సీతమ్మ కూడా" అని ఇంకో రెండు పుచ్చుకున్నాడు. "మారు వడ్డించినందుకు కొసరు" అని మరికొన్ని జబురు కొన్నాడు.

నాగేశం ఏడ్పుతో ఇల్లెగిరిపోయింది. దానితో సంతర్పణలు ఆగిపోయినవి. మళ్ళీ ఆ యింట్లో ఆ ముగ్గురూ ఎన్నడూ భోజనము చేసి యెరుగరు. అలో లక్ష్మణా అని రాముడు అన్నమో రామచంద్రా అని లక్ష్మణుడూ అంటే ఇప్పటికీ ఆ మాటలు భూలోకంలో బిచ్చగాళ్ళవద్ద నిలవ వున్నవి.

నాగేశం పాట మార్చివేసి చాలా రోజులదాకా.

*"అంతట కనుపించె మాఅవ్వగుండు*
*ఆ దెబ్బలకు నా ఒళ్ళంత పుండు!"*

అని పాడుతూ వుండేవాడు. పాపము కథ అడ్డంగా తిరిగింది!

*(సాహితీ ద్వైమాస పత్రిక, 1924)*